క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

సినీ నటుడు సుమన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సుమన్ తదితరులు

కందుకూరు: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చలనచిత్ర నటుడు సుమన్ అన్నారు. మండలంలోని కొత్తగూడ చౌరస్తా పరిధి హైదరాబాద్ టెక్నో స్కూల్ 14వ వార్షికోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ రఘురామ్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట, పాటలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సుమన్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.నారాయణరెడ్డి, కోశాధికారి మహేందర్‌రావు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



నిరసన వ్యక్తంచేస్తున్న ముస్లింలు

కందుకూరు: రంజాన్ చివరి శుక్రవారం జమాతుల్-విధా సందర్భంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు మండల పరిధి నేదునూరు జామియా మసీదులో ముస్లింలు వక్ఫ్ సవరణ బిల్లు- 2024కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కేంద్రం తెస్తున్న బిల్లును అంగీకరించేదిలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, ముస్లిం సంఘం అధ్యక్షుడు ఎండీ నిజాముద్దీన్, ఎండీ ఇబ్రహీం, ఎండీ మున్వర్, ఎండీ పర్వేజ్, ఎండీ అజారుద్దీన్, ఎండీ అలీమ్‌బేగ్,ఎండీ సల్మాన్, ఎండీ సర్దార్, ఎండీ అన్వర్‌బేగ్, ఎండీ నయీమ్‌బేగ్, ఎండీ నదీమ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ ఏఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ బడంగ్‌పేట ఫీడర్ పరిధిలోని భీష్మానగర్, శారదా ఎన్‌క్లేవ్, గండారెడ్డికాలనీ, సాయిగోకుల్, సాయినగర్, రైతుబజార్, లెనిన్‌నగర్, హుడాకాలని, అన్నపూర్ణకాలని, బృందావన్‌కాలని, చింతలకుంట, లెనిన్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, అదే విధంగా తిరుమలనగర్ ఫీడర్ కింద వినాయకహిల్స్ ఫేజ్-1,2,3 తిరుమలనగర్, శ్రీహిల్స్‌కాలనీలో సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. 11కేవీ నందిహిల్స్ ఫీడర్ పరిధిలోని టీచర్స్‌కాలనీ, శివహిల్స్, నందిహిల్స్, చైతన్యహిల్స్, శివగంగహిల్స్‌లో సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు, 11కేవీ మీర్‌పేట ఫీడర్ పరిధి ఆర్ఎన్‌రెడ్డినగర్, ఆదిత్యనగర్, గణేశ్‌కాలనీ, రాఘవనగర్ కాలనీ, తిరుమలహిల్స్, మీర్‌పేట విలేజ్, ద్వారకామయికాలనీలో మధ్యాహ్నం 2.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ తెలిపారు.

కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయండి

మహేశ్వరం: ఏప్రిల్ 21, 22న శంషాబాద్‌లో నిర్వహించే తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వలస కార్మికులకు ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి, పనికి తగిన వేతనాలు ఇవ్వకుండా బడా కంపెనీల యాజమాన్యాలు, గుత్తేదార్లు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. సభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మండే ఎండ.. షేడ్ నెట్ అండ



ఏట్లఎర్రవల్లి గ్రామంలో నర్సరీలో ఏర్పాటు చేసిన షెడ్ నెట్

నర్సరీలలో చలువ పందిళ్లు

- వేసవిలో మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు
- నిత్యం పర్యవేక్షిస్తున్న అధికారులు

షాబాద్: ఎండలు మండుతున్నాయి. వనమహోత్సవంలో భాగంగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే చలువ పందిళ్లు(షెడ్ నెట్లు) వేశారు. తద్వారా ఎండ తీవ్రత పూర్తిగా తగ్గి మొక్కలకు కావాల్సిన సూర్యరశ్మి తగిలి ఏపుగా పెరుగుతాయి. ప్రస్తుతం వడగాలులు వీస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ పర్యవేక్షణ బాధ్యతలు పంచాయతీలకే అప్పగించారు. నర్సరీలలో పెంచే మొక్కలు ఇళ్లు, రహదారుల పక్కన, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నాటేందుకు అధికారులు ప్రణాళికలను సైతం రూపొందించారు. మండలంలో 41 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో 10వేల చొప్పున 4లక్షల 10వేల మొక్కలు పెంచుతున్నారు. ఈ మొక్కలను వర్షాకాలంలో నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

కార్యదర్శులకు బాధ్యతలు

నర్సరీల నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో కార్యదర్శులకు అప్పగించారు. ప్రతి నర్సరీలో పెంచుతున్న మొక్కలను ఉపాధిహామీ కూలీలతో రోజు నీటిని పట్టించి మొక్కలు ఎండిపోకుండా చూస్తున్నారు. నర్సరీల నిర్వహణపై నిత్యం మండల స్థాయి అధికారులు సమీక్షిస్తున్నారు.



“ షెడ్లు ఏర్పాటు చేశాం



ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. అవి ఎండిపోకుండా ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రీన్‌నెట్ షెడ్‌లు ఏర్పాటు చేశాం. మొక్కలు నాటే కార్యక్రమం నాటికి పెంచి అందుబాటులోకి తీసుకువస్తాం.

– వీరాసింగ్, ఏపీఓ, షాబాద్

మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ



నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నర్సరీల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో పెంచే ప్రతి మొక్కనూ కాపాడుతున్నాం.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్

రెండు కార్పొరేషన్ల మధ్య అధ్వాన రోడ్డు

పట్టించుకోని అధికారులు



మీర్‌పేట- అల్మాస్‌గూడ మధ్య రోడ్డు దుస్థితి

మీర్‌పేట: రెండు కార్పొరేషన్ల మధ్యనున్న అధ్వాన రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మీర్‌పేట- అల్మాస్‌గూడ ప్రాంతాల మధ్యలో ఉన్న ప్రధాన రహదారి ధ్వంసమై, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అయినా అటు బడంగ్‌పేట, ఇటు మీర్‌పేట కార్పొరేషన్ల అధికారులు తమకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శించారు. రెండు కార్పొరేషన్ల మధ్య రహదారి చాలా చోట్ల గుంతలమయంగా ఉన్నప్పటికీ.. ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కావడం లేదని కాలనీల వాసులు పేర్కొంటున్నారు. ప్రశాంతిహిల్స్ రోడ్ నం.4లో రెండు నెలలుగా తాగునీటి పైపులైన్ లీకై.. నీరంతా రోడ్డుపై పారుతోంది. దాంతోపాటు రహదారి మధ్యలో గుంత ఏర్పడి వాహనదారులకు, బాటసారులను మరింత అసౌకర్యానికి గురిచేస్తోందని వాపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, నీటి లీకేజిని అరికట్టి, రోడ్డుకు మరమ్మతులు చేయించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వక్ఫ్ బిల్లు సవరణపై నిరసన



షాద్‌నగర్: ఆందోళన వ్యక్తం చేస్తున్న ముస్లిం నాయకులు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలో ముస్లిం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు పట్టణంలో ముస్లింలు నమాజ్‌ల అనంతరం మజీదుల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తుందని, వక్ఫ్ బిల్లును సవరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు హఫీజ్ అన్వర్, అలీం షాకీబ్, హాజీ, ఫయాజ్, నయూం, ఇర్ఫాన్, యూసుఫ్, అసీఫ్‌గోరి, పర్వేజ్, షాకీర్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లును ఉప సంహరించుకోవాలి

కొందుర్గు: వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే ఉప సంహరించుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్‌కు మండల ముస్లిం మైనార్టీలు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ తప్పుడు ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.



మొయినాబాద్‌రూరల్: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఆడపిల్లల కుటుంబాలకు చేయూత

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రభుత్వం ఆడపిల్లలు ఉన్న కుటుంబాలకు అండగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మండలంలోని 81 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 62 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలు ఉన్న కుటుంబాలు భయపడకుండా ఉండాలని, వారికి చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పేద ప్రజల కోసమే నిరంతరం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, నాయకులు వసంతం, వీరేందర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, పాండు, జనార్దన్, వెంకటేశ్, రాంచంద్రయ్యగౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 64 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 31 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఎంపీడీఓ సంధ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- క్రమంగా సంక్షేమ పథకాల అమలు
- అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: 'ప్రభుత్వంతో పనిచేయించుకోవడం ప్రజల హక్కు. అధికారులు ఎవరైనా లంచాలు అడిగితే ఇవ్వొద్దు. ఇవ్వాలని డిమాండ్ చేస్తే.. ఫోన్ ద్వారా నాకు సమాచారం ఇవ్వండి' అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రం అప్పుల కుప్పగా ఉందని, ఉద్యోగులకు కనీసం జీతాలు ఇవ్వడానికే ఇబ్బంది పడాల్సి దుస్థితి ఉండేదని తెలిపారు. ప్రతి నెల రూ.6 వేల కోట్లు వడ్డీ కట్టడానికే సరిపోతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కష్టాల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. అనివార్య కారణాల వలన కొన్ని పథకాలను అమలు చేయడం లేదని, దీనిపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నమాట వాస్తవమేనని ఎమ్మెల్యే అన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం, నిరుద్యోగ యువతకు సంక్షేమ పథకాలను అమలు చేయనున్నామని వివరించారు.

ఆదర్శ సంఘం

తుర్కయంజాల్ సహకార సంఘం రాష్ట్రంలోని ఇతర సంఘాలకు మొదటి నుంచి ఆదర్శంగా నిలుస్తుండటం అభినందించదగిన విషయమని ఎమ్మెల్యే కొనియాడారు. సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్, టిస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధి కోసం సంఘం తరుపున అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని, త్వరలోనే డ్రోన్‌ల ద్వారా పంటలకు మందులను పిచికారీ చేసే యంత్రాలను అందుబాటులోకి తేనున్నామని చెప్పారు. ఈ సందర్భంగా 2024 సెప్టెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు జరిగిన జమా, ఖర్చులను ఆమోదించడంతో పాటు, 2025- 26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవ రెడ్డి, చాపల యాదగిరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. విద్యా, వైద్య రంగాలు నిర్వీర్యం

తలకొండపల్లి: కొందరు ఉద్యోగులు ప్రభుత్వం నుంచి వేతనం తీసుకుంటూ.. ప్రైవేట్ రంగాల వృద్ధికి పాటుపడుతున్నారని బీఎస్పీ తాలుకా అధ్యక్షుడు దన్నారం బాలు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వారి నిర్లక్ష్య ధోరణి తో ఈ రెండు రంగాలు నిర్వీర్యం అవుతున్నా యని పేర్కొన్నారు. తద్వారా పేదలకు సర్కారు విద్య, వైద్యం అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైద్యులు సొంతంగా క్లినిక్‌లు, ఉపాధ్యాయులు పాఠశాలలను నడిపిస్తూ మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ రంగాలకు అనుకూలంగా ఉన్న వారినే ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. బహుజనులందరికీ న్యాయం జరగాలంటే ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.

హైవే పక్కనే చెత్తాచెదారం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి ఔటర్‌రింగ్‌రోడ్డు సమీపంలో విజయవాడ జాతీయ రహదారి, ఔటర్ సర్వీస్‌రోడ్డు పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. సమీపంలోని దుకాణదారులు, బాటసింగారం పండ్ల మార్కెట్‌కు పండ్లు తీసుకువచ్చే వాహనదారులు రోడ్డు పక్కన చెత్తాచెదారాన్ని పారబోస్తున్నట్లు సమాచారం. పురపాలక సంఘం అధికారులు స్పందించి, చెత్తను తొలగింప చేయాలని ప్రజలు కోరుతున్నారు. చెత్త వేస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

భక్తి భావంతో మెలగాలి

ఆమనగల్లు: రంజాన్ మాసం చివరి శుక్రవారంను పురస్కరించుకుని పట్టణంలోని వివిధ మసీ దుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జామై మసీదు, మహ్మదీయ మసీదు, హమాదే హిలాల్ మసీదుల్లో సందడి నెలకొంది. అనంతరం ప్రార్థనాలయాల్లో మత గురువులు వహీద్, లతీఫ్‌లు మహ్మద్ ప్రవక్త బోధనలతో పాటు, అల్లా సూక్తులను చదివి వినిపించారు. ప్రతి ఒక్కరూ అల్లాపై భక్తి భావంతో మెలగాని సూచించారు.

కాలనీల అభివృద్ధికి కృషి

వనస్థలిపురం: కాలనీలలో సమస్యల పరిష్కారానికి, కాలనీల సమగ్ర అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. క్రాంతిహిల్స్ కాలనీలో హెరాల్డ్ స్కూల్ ముందు ఉన్న పార్కు ప్రహరీ నిర్మాణం, చింతలకుంట రేడియో కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు బద్దం రాంరెడ్డి, కంచర్ల సత్తిరెడ్డి, మనోహర్, రామాంజరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేష్, కోటేశ్వర్‌రావు, రవిందర్‌రెడ్డి, సునంద, నాయకులు నరసింహాయాదవ్, అజయ్‌యాదవ్, ప్రేంకుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశం

చాదర్‌ఘాట్: 'సాక్షి'దినపత్రికలో వచ్చిన కథనానికి వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారి ఈ.మల్లేశం తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. మూడు రోజులు మార్కెట్‌కు సెలవులు ఉన్నాయన్నారు. వచ్చే మంగళవారం చలివేంద్రాల ఏర్పాటుకు అధికారులు సన్నద్ధం అవుతారని పేర్కొన్నారు.

కళాకారులకు సన్మానం



కళాకారులను సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

షాద్‌నగర్: కోదాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి కళా ప్రదర్శనలో షాద్‌నగర్ కళాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కళాకారులు శ్రీనివాస్‌రెడ్డి, చెన్నయ్య, నర్సింలుగౌడ్, మాణిక్యం, సత్యనారాయణలను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ... తెలుగు సంస్కృతి, కళలను పరిరక్షించడంలో కళాకారుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పద్యాలు, సాహిత్య స్ఫూర్తిని ప్రజలలో నింపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీవాణి సాంస్కృతిక కళాబంధువు బందారిరమేష్, విశ్రాంత ఉద్యోగులు జగదీశ్వర్, స్వరాజ్‌బాబు, గోపాల్‌రావు, శంకర్, గోపాలస్వామి, రాధాకిషన్‌రావు, గిరిజ, శంకర్, లక్ష్మీనర్సింహారావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరాజు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం మరమ్మతులకు తోడ్పాటు



పునఃప్రారంభంలో విద్యార్థులతో మాజీ కౌన్సిలర్ లావణ్య తదితరులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సింగాపూర్‌లో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. సమస్యను టీచర్లు, స్థానికులు 10వ వార్డు మాజీ కౌన్సిలర్ లావణ్య దృష్టికి తీసుకొని వెళ్లగా.. ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం మరమ్మతుల కోసం సుమారు రూ.లక్ష వెచ్చించి, బాగు చేయించారు. శుక్రవారం వార్డు ప్రజలతో కలిసి పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. సింగాపూర్‌లో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ముందు ఉంటానని చెప్పారు.కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, పాపిరెడ్డి, సీహెచ్ కృష్ణ, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.9.08 లక్షలకు తైబజార్ వేలం



తైబజార్ కైవసం చేసుకున్న చంద్రయ్యను సన్మానిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ, నాయకులు

కడ్తాల్: తై బజార్‌కు వేలం పాట వేయగా.. రూ.9.08 లక్షలకు పలికింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి ఎంపీడీఓ సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం కడ్తాల్ జీపీ కార్యదర్శి అల్లాజీ అధ్యక్షతన జీపీ కార్యాలయంలో తై బజార్‌కు వేలం నిర్వహించారు. ప్రభుత్వ కనీస ధర రూ.9,07,750గా నిర్ణయించారు. వేలంలో ముగ్గురు పోటీ పడగా.. రూ.9,08,500 (తొమ్మిది లక్షల ఎనిమిది వేల ఐదు వందలు)లకు గురిగళ్ల చంద్రయ్య తైబజార్‌ను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఎంపీఓ లాలయ్య మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారమే డబ్బులు వసూలు చేయాలని నిర్వాహకుడికి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, యాదయ్య, మహేశ్, చేగూరి మహేశ్, నాయకులు నర్సింహ, చంద్రయ్య, రాజేందర్‌గౌడ్, నాగార్జున్, మహేశ్ పాల్గొన్నారు.

హస్తినాపురం డివిజన్‌ను అభివృద్ధి పరుస్తాం

ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్



హస్తినాపురంలో కార్పొరేటర్ సుజాతనాయక్‌తో కలిసి పర్యటిస్తున్న మధుయాష్కీగౌడ్

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్‌తో కలిసి శుక్రవారం మధుయాష్కీగౌడ్ శ్రీరమణకాలనీ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ అభివృద్ధికి రూ.16.12కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. ఏపీఎస్ఈబీ కాలనీలో రూ.12.50 కోట్లతో కాలనీ నుంచి బైరామల్‌గూడ చెరువు వరకు వరదనీటి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. శ్రీరమణకాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.89.37 లక్షలు, ఆర్‌కేఆర్ ఎన్‌క్లేవ్‌కాలనీలో బీటీ కరోడ్డు మరమ్మతులకు రూ.15 లక్షలు, భీమానగర్‌కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.30లక్షలు, అగ్రికల్చర్‌కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.81.50లక్షలు, విజయదుర్గా కాలనీ సీసీ రోడ్డుకు రూ.35లక్షలు, శివసాయినగర్‌కాలనీలో సీసీరోడ్డుకు రూ.25లక్షలు, దాతూనగర్, వెంకటేశ్వరకాలనీ, శ్రీరమణకాలనీ ఫేజ్01, రోడ్ల నిర్మాణానికి రూ.86.75లక్షలు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దెంది శశిధర్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.22.50 కోట్ల రుణాలు అందించాం

- మొండి బకాయి రూ.8.30 కోట్లు వసూలు
- సహకార సంఘం చైర్మన్ భరత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: గడిచిన ఏడాది కాలంలో బాటసింగారం రైతు సేవా సహకార సంఘం పరిధి రైతులకు రూ.22.50 కోట్ల రుణాలను అందజేశామని సంఘం చైర్మన్ చేగూరి భరత్ కుమార్ తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని సంఘం కార్యాలయ ఆవరణలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సహకార శాఖ జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సంఘం నుంచి అందించే రుణాల గరిష్ట పరిమితి రూ.10లక్షల నుంచి 15 లక్షలకు పెంచామని, సంఘం కార్యకలాపాలను అభివృద్ధి చేసి రూ.103 కోట్ల టర్నోవర్‌ను సాధించామని పేర్కొన్నారు. రుణాలు చెల్లించని 324 మంది మొండి బకాయిదారుల నుంచి రూ.8.30కోట్లు వసూలు చేశామని ఆయన వెల్లడించారు. సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని రైతులకు సూచించారు. సంఘం జమాఖర్చులు, సంఘం వ్యవహారాల నివేదిక, ఆడిట్ రిపోర్ట్‌ను మేనేజర్ జక్కుల ఐలేష్‌యాదవ్, సభ్యులకు చదివి వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నార్ల కొండ మల్లమ్మ జంగమయ్య యాదవ్, డైరెక్టర్లు మొగుళ్ల యాదిరెడ్డి, పగిళ్ల బాల్ రెడ్డి, బిజిలి బాలనర్సింహ, గంట శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386